వల

ప్రయాగ రామకృష్ణ



ప్రొఫెసర్ శివానందం ఆ ఏడు యూనివర్శిటీ వాళ్ళకి ఎక్స్టర్నల్ ఎగ్జామినర్. అంటే అప్పటి వరకూ ఇంటర్నల్ ఎగ్జామినర్స్ వాల్యూ చేసిన పేపర్లు చివరి సారిగా శివానందం చేతిలో పడి చావుదెబ్బలు తింటాయన్నమాట.

"ఎక్స్టర్నల్ ఎగ్జామినర్" అంటే నాకు తెలిసిన అర్థం అది.

శివానందం టేబులు ముందర కుర్చీలో కూర్చుని తల వంచుకొని పేపర్లు దిద్దుకుంటున్నాడు. వరండాలో అలా ఎంతసేపటి నుంచి నిల్చుని వున్నారో వాళ్ళు — ప్రొఫెసర్ శివానందం గమనించనేలేదు. గమనించిన తరువాత కుర్చీలోంచి లేచాడు.

వరమిచ్చే వేల్పు కళ్ళముందు నిలబడినట్టే నిలబడి అదృశ్య మవుతాడేమోనన్న భయం ఆ వచ్చిన వాళ్ళలో వుంది.

చేతులు జోడించారు.

ప్రతినమస్కారం చేస్తూ 'ఎవరు కావాలి?' అన్నాడు శివానందం.

వచ్చినవాళ్ళు మాట్లాడలేదు.

మూగవాళ్ళలా కనిపించారు. మేకపిల్లల్లా ఇద్దరూ ఒదిగొదిగి నిలబడ్డారు. వాళ్ళలో ఒకరికి నలభై ఏళ్ళు మరొకరికి ఇరవై ఏళ్ళు వుంటాయి. ఇద్దరూ భయభక్తులతో నిలబడ్డారు. కాని కుర్రవాడు అప్పుడప్పుడు లేడిలా బెదురుతున్నాడు.

'ఏంకావాలి'

'మావాడి హిస్టరీ పేపరు మీదగ్గరుంది. ఆవిషయం తెలిసి అర్జిద్దామని వచ్చాను.

శివానందం తన కుడిచేతిలోని ఎర్ర పెన్సిల్‌ని టేబులుమీదకు విసిరేస్తూ 'అత వేమౌతాడు మీకు' అన్నాడు.

చరిత్రకన్నా లౌకికం బాగా తెలుసాయనకు. రంగులు కలపడం వేయడం రెండూ చాతవు. నలభై ఏళ్ళకే ప్రొఫెసరై పోవడానికి కారణం కూడా అదే... కుర్ర ప్రొఫెసర్ వున్నట్టుండి ఎక్స్టర్నల్ అయ్యాడన్న అదే అసలు రహస్యం.

'మా అబ్బాయి. లేక లేక ఒకడు కలిగాడు'

శివానందం నవ్వుకున్నాడు. ఇవాళ ఇలా మాస్టర్స్‌డిగ్రీ తీసుకుని రేపు డాక్టరేట్ అయ్యేదికూడ అతనే. అప్పుడీ తండ్రే బుజా లెగరవేస్తూ మావాడు యం. ఏ. పిహెచ్‌డి. అంటాడు. ఆశ్చర్యమేం లేదు.

కూర్చోండన్నాడు తీరా వాళ్ళు కూర్చోబోయే సమయానికి తను కుర్చీలో కూర్చున్నట్టే కూర్చుని లేచి నిలబడ్డాడు. ఆ వచ్చిన వాళ్ళు కూర్చోవాలన్న ఆశను చంపుకున్నారు. అది వాళ్ళ ముఖాల్లో ద్యోతకమవుతూనే వుంది.

శివానందం ఏదో మాట్లాడబోయి మరేదో డైలమాలో పడి కాసేపు నిశ్శబ్దంగా వుండిపోయాడు. చాలా మంది చాలాసార్లు తికమకలో పడ్డారు. ఒక్కోమనిషికి ఒక్కో రకం డైలమా. కాదని కొట్టేయలేం. ప్రొఫెసర్ శివానందంకూడ ఇప్పుడు అలాంటి డైలమాలోనే పడ్డాడు. ఉపయోగ పడ్తారనుకున్న వాళ్ళ దగ్గర ఆయన ఎప్పుడూ ఒకే ఒక అస్త్రం ప్రయోగిస్తారు. మనకు పనికొస్తాడనుకుంటే ఓ చిరునవ్వు విసరడం, లేకపోతే ముఖం గంభీరంగా చేసుకుని పక్కకు తప్పుకోవడం. ఇలా ముఖంలో అనేక రంగులు మారుస్తాడాయన. మామూలు మనుషులకి రంగుల భాష తెలీదు.

శివానందం ముందు గదిలో మూడు సోఫాలున్నాయి. వాటి మధ్యగా టీపాయివుంది. రకరకాల ఫోటోలు గోడలకు తగిలించున్నాయి. వాటన్నిటినీ చూస్తున్నారేమోనని చాలా సేపటి వరకూ వాళ్ళని మాట్లాడించలేదు ఆయన

"ఇంతకీ మీ వాడికి ఫస్ట్‌క్లాసివ్వాలంటారా ?"

శివానందం ప్రశ్నకి కార్యార్థులై వచ్చిన ఇద్దరూ చేతులు కట్టుకుని అవునన్నట్టు తలూపారు. మళ్ళీ ఆయనే ఏదో చెప్పబోయి మధ్యలో ఆగారు.

గోడగడియారం గంటలు కొట్టడం మానేసినట్టుంది. లేచివెళ్ళి రేడియో ఆన్ చేశారు. నాలుగు గంటల ముప్ఫయినిముషాలు బి. బి. సి. వాళ్ళిస్తున్న ప్రైమడి. గడియారంలో చిన్న ముల్లుని నాలుగు మీదకి పెద్ద ముల్లుని ఆరుమీదకు తోసేసి రేడియో కట్టేశారు ఆయన.

నిజానికి శివానందం మామగారు కూడ కొన్నాళ్ళ క్రితం ఇలాంటి డైలమాలోనే పడాల్సింది. పడే అవకాశాలు కూడ అప్పట్లో ఆయనకు లేకపోలేదు. కాని పడలేదు. పడక పోవడం ఆయన ఖర్మ. అంతకుమించి మరేం కాదు. ప్రొఫెసర్ సత్యనారాయణ పందొమ్మిది వందల ముప్ఫయినాలుగునుంచి చెన్నపట్నంలో వుంటున్నాడు. అప్పటినుంచీ ఇప్పటివరకూ ఒకే అద్దె ఇల్లు. నాలుగు గదులుంటాయి. ముందు వరండా, ఆ వరండాలో ఎత్తుగావున్న అరుగుమీద కూర్చుని తీరిక సమయాల్లో కట

కటాఖ్లోంచి వీధిలోకి చూస్తుంటారాయన. అది ఆయన హాబీ. వాళ్ళ ఇంటికి ఎదురుగా వున్న రోడ్డు వెంట కొంతదూరం పోయాక పక్క సందులోకి మళ్ళి ఆతరువాత కుడిచేతి వైపుకు వెళ్లి అక్కడనుంచి ఎడమచేతి వైపు మూడో మలుపుకు తిరిగితే ఆయన కాలేజీ. తన ముప్ఫయి ముప్ఫయి ఐదేళ్ల సర్వీసులో సత్యనారాయణకు బయటి ప్రపంచాన్నిగురించి తెలిసింది బహుతక్కువ. ప్రొద్దున్నే కాలేజీకి వెళ్టం సాయంత్రం నాలుగయ్యేటప్పటికి ఇంటికి రావడం ఆ తరువాత ఆయన పేపరు పఠిస్తూ పడకకుర్చీలో పడుకుంటే పక్కనే కూర్చుని బియ్యంలో మట్టిగడ్డలేరుస్తూ వసంతమ్మ కబుర్లు చెప్పడం—ఇదీ ఆయనకు తెలిసింది. ఇది మినహా ప్రపంచం ఏమైనా ఆయనకు అనవసరం. వసంతమ్మ వయసు యాభై. ఆవిడ ఆయనకు భార్య. వీళ్లిద్దరికీ పెళ్లయి అత్తవారింటికెళ్లినఆడపిల్లకాకుండా రెడీగా పెళ్లికెదిగిన నలుగురు కూతుళ్లున్నారు. ఎదుగుతూ ఎదుగుతూవున్న మరో ఆడపిల్ల వుంది. వీళ్లందరికీ పెళ్లిళ్లు ఎలా అవుతాయా అన్నదిగులు వసంతమ్మకుందిగాని ప్రొఫెసర్ గారికి ఇంతవరకూ లేదు. అందుకే మాటల్లో అప్పుడప్పుడు ఆయన్ని సుతారంగా మందలిస్తుంటుంది వసంతమ్మ 'మీకు చీమ కుట్టినట్టయినా లేదని.' ప్రొఫెసర్‌గారు పరధ్యానంగా 'ఊ' కొడ్తారు.

నిన్న మొన్నటివరకూ ఆయన కెలాంటి భయమూ బెంగాలేవు. కాలేజీయే ఆయన ప్రపంచం. పిల్లలకు పాఠాలు చెప్పడమే తన విధి అనుకునేవాడు. మొదటి తేదిన జీతం తీసుకొచ్చి పెళ్లాం చేతుల్లో పోస్తే అన్నీ ఆవిడే సర్దుకుపోయేది. అంతకుమించి ఆయన కేం తెలిసేదికాదు. చిన్నప్పటి నుంచీ ఆయన దదే తత్వం. వారాలే చేసుకున్నాడో వస్తుతే వున్నాడో ఒకటో తరగతి నుంచి ఆనర్సు వరకూ కష్టపడి చదువుకున్నాడు. తరువాత ఈ ఉద్యోగం వచ్చింది. ఆనర్సు పాసయిన తరువాత సత్యనారాయణకు మా పిల్లనిస్తామంటే మా పిల్లనిస్తామని చాలమంది ఎగబడ్డారు. అప్పరసనే చేసుకోవాలని. ఆయన ఎప్పుడూ అనుకోలేదు. తన కూతురు వసంతను చేసుకోమని ఎవరో వారానికి రెండుపూటలు భోజనం పెట్టినాయన బ్రతిమాలాడు సరే అని తాళి కట్టాడు. ముప్ఫయ్యేళ్లు సత్యనారాయణతో సంసారం చేసిన తరువాత ఆ వసంతే ఇప్పుడు వసంతమ్మగా మారింది. భర్తకేనాడు ఆవిడ ఇంతవరకూ ఎదురు చెప్పలేదు. గుంటూరు జరీ చీర కొనిపెట్టినా, గద్వాల్ గళ్లచీర కొనిపెట్టినా సంతోషంగానే కట్టుకుంది. కాని ఇప్పుడు ఆవిడకు ఒకటేకోరిక — బి. టి. అయి కార్పొరేషన్ స్కూళ్లల్లో పనిచేస్తున్న ముగ్గురాడపిల్లల్ని ముందు ఏ. పి. హెచ్. డీలకో ఇంజనీర్లకో ఇచ్చేయా అని సత్యనారాయణ అంతా విని మనచేతుల్లో ఏముందే పిచ్చిదాన అని నవ్వి వూరుకునేవాడు.

నవ్వుతూ నవ్వుతూనే రిటైరై పోయాడు. రిటైరైన తరువాతగాని పిల్లలకు పెళ్లిళ్లు చెయ్యాలన్న సంగతి గుర్తుకు రాలేదాయనకు. పెద్దల్లుడికి ఉత్తరం రాస్తే రెండో రోజుకే రెండు సంబంధాలేవో సిద్ధంగా వున్నట్టు కబురొచ్చింది. ఒకపిల్లవాడు పశువులడాక్టరు. పశువుల డాక్టరుకి ముప్ఫయి ఐదేళ్లు వస్తున్నా అప్పుడే పెళ్లేమిటని ముద్దుగా ముద్దుగా గునుస్తున్నాడు. అతని వాటాకి వాళ్ల స్వగ్రామంలో ఏక్షణంలోనైనా పడిపోవడానికి సిద్ధంగా వున్న పెంకుటింట్లో సగం, అక్కడెక్కడో అదేదో ప్రాజెకు వాళ్లు దయతలచి నీళ్లొదిలేస్తే సేద్యం అయ్యే అరెకరం పొలమూ వున్నాయి. పదిహేనువేలైతే ఫర్వాలేదన్నాడు. పిల్లను చూడకుండానే. తీరా చూసిన తరువాత పిల్ల పొడుగ్గా వుందన్నాడు. 'అఫ్‌కోర్స్ సర్దుకోవచ్చులెండి' కాబోయే మామగారితో పళ్లికిలిస్తూ పరాచికాలాడాడు పశువుల డాక్టరు.

ఆడపడుచు లాంఛనాలు వెండి చెంబు వెండి కంచం పట్టు బట్టలు కాకుండా పన్నెండు వేలైతే మాకేం అభ్యంతరం లేదన్నాడు సత్యనారాయణ రెండో కూతుర్ని చూసిన ఓ పళ్లడాక్టరుని కన్నతండ్రి. పిల్లవాడిదగ్గర పేషెంట్లు పళ్లుపీకడానికి పట్కార్లున్నా వున్నాయో లేవో అనుమానమే. కుర్రడాక్టర్నిద్దర్నీ చూసిన తరువాత సత్యనారాయణకు అరికాలి మంట నెత్తికెక్కింది. పిల్లలకు పెళ్లిళ్లయ్యే యోగ్యత ఎప్పుడుంటే అప్పుడవుతాయని వూరుకున్నాడు. కాని వసంతమ్మ పోరుతూనే వుంది — డాక్టర్లే కావాలనేముంది. ఇంజనీర్లయితే మాత్రం ఏమని.

'ఏం ఇంజనీర్లకు డబ్బుచేదా' అన్నాడు కొంచెం కోపంగానే భార్యతో సత్యనారాయణ.

అర్థంకాలేదు ఆవిడకి. అర్థం అయ్యేందుకు ఏముంది కాబట్టి ఇందులో...

వాళ్ళాయన డబ్బు పుచ్చుకుని ఎవరికీ మార్కులు వెయ్యలేదు. పేపర్లవుట్‌చేసి పేవుమెంట్‌మీద షాపు పెట్టలేదు. ట్యూషన్ల పేరుతో పైసా సంపాదించలేదు. ఎవరైనా ఏమైనా తెలీలేదనివస్తే సంతోషంగా నాలుగు ముక్కలు చెప్పిపంపేవాడు. లేకపోతే వూరుకునేవాడు.

అదేమని ఎవరైనా అడిగితే సరస్వతిని కూడ అమ్ముకోవడమే అని కోపంగా చూసేవాడు.

ఫలితం దేనిదైనా కానివ్వండి — సత్యనారాయణ నలుగురు కూతుళ్లకీ పెళ్లిళ్లు కాలేదు.

* * *

బండిల్ విప్పి ఒక్కొక్క పేపరే చూస్తున్న ప్రొఫెసర్ శివానందానికి ఆలోచన్లు ఆగడం లేదు. తను చేయబోతున్నది ఎంతవరకూ న్యాయమో తనకు తెలుసు. కాని ఈ ఫలాన వాళ్లిద్దరూ క్లాసుకోసం ఐదువేలో పదివేలో ఇచ్చేయగలరు. నాలుగు బేరాలిలాంటివి జరిగితే తను నిక్షేపంగా కూతురి పెళ్లి చేసేయగలడు. లేకపోతే కులము గోత్రము కనుక్కొని క్లాసు ఇచ్చేసి కూతుర్ని ఆకుర్రాడికే నయాపైసా కట్నం లేకుండా కట్టబెడ్తే సరిపోతుంది. పిల్లవాడుకూడ బాగానే వున్నాడు.

శివానందం తన ఆలోచనలకు తనే మురిసిపోయాడు. మరో రోజు వాళ్లని మళ్లీ కలవమన్నాడు. క్లాసుకోసం వచ్చిన కుర్రాడూ, కుర్రాడితండ్రికొండెక్కినంత సంబర పడ్డారు. శివానందం ఇంకా ఆలోచిస్తూనే వున్నాడు

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

మంగళ— కాకినాడ.

మా అమ్మాయిలకి మీ జవాబులు నచ్చుతాయి. ఏభయోపడిలో పడ్డ శ్రీవారికి నచ్చుతాయి. నలభైలో పడ్డ నాకూ పసందుగా వుంటాయి. మీరు అందరినీ ఆనంద పరుస్తున్నారని చెప్పడానికి వయస్సులు చెప్పాను ?

వయస్సుతో పని ఏముందీ ? మనసుతోగాని ! సోదరీ. నేను—పిల్లల్లో పిల్లని. పెద్దల్లో పెద్దని. ఆడవాళ్ళమధ్య ఆడదాన్ని. కాని మగవాళ్ళ మధ్య మగవాడిని! అందుకే తిట్టుకుంటూనో, దీవించుకుంటూనో అంతా అభిమానం చూపుతారు— నా పట్ల !

పి. ఆర్. ఆర్— కడప.

కిరీటి వాడి అయిన బాణముల కంటే పదునైన పదములతో మా మగవారి కోమల హృదయములను నొప్పింపనేల ? ఇది మీకు సమంజసమేనా !

సిగ్గు సిగ్గు......ఏల నిట్లు బేలవై పల్కెదవు ! మిత్రమా......ఆడువారాలకించిన నగుబాటు కాదా ?

కె. వై. ఎస్— పెంట్లవెల్లి.

మీరిచ్చే తల తిరుగుడు జవాబులు మీపై ఏ అఘాయిత్యానికేనా దారి తీయవచ్చు కావున...

గాజులు తొడిగించుకూర్చోమంటావు అంతేనా ? పిరికివాడు రోజూ చస్తాడు. ధైర్యస్థుడు ఒకసారే చస్తాడు —అని నమ్మకం కలదాన్ని నేను.

ఎమ్ ఏ ఆర్— విశాఖపట్నం.

ఆడవారిని ఆరిటాకు తోను. . .

ఆపండి గోల ! ఆడది, అరిటాకు సామెత విని విని నాకు అరిటాకంటే ఎలర్జీపట్టుకుంది. అరిటాకులో అన్నం తిననని శపథం పట్టాను.

జి. ఆర్. ఎల్ - వైరా.

మంచిగాగాని, చెడుగా గాని మగవాళ్ళ చర్యకు బలిగాని స్త్రీ ఉత్తమురాలు. . ...

అలా అయితే అలాంటి ఉత్తమురాలెక్కడా వుండరు.

ఎస్. ఎ. జి-మద్దికెర.

పురాణాల్లోని యుద్ధాలకు, చరిత్ర లోని ప్రపంచ మహాయుద్ధాలకు చాలా మటుకు స్త్రీయే కారణం. స్త్రీ ప్రపంచానికో శాపం. అన్న నా అభిప్రాయంతో మీరు ఏకీభవించ కలరా ?

చచ్చినట్టు ! కాని ఒక్క అనుమానం—ఇలాంటి స్త్రీతో జీవితం పంచుకుందుకు రాజ్యాలని కాలదన్నినవారు, ప్రపంచాన్ని ఎదిరించినవారు, సర్వస్వాన్ని వదులుకున్నవారు ఉన్నారే . . . అప్పుడు స్త్రీని శాపమనాలా తాపమనాలా ? . . .సంకుచితులు శాపంగా చూస్తే సహృదయులు సర్వంగా ఎంచుతారు.

కె. ఆర్. బి: కె. ఎన్. బి. కె. జె బి; కె. ఎమ్. ఎస్. క. పి.

చదువుకు ముగింపు ఏది ?

లేదు.

ఈ జీవితంలో మానవుడికి అతి సులభమైనది అతి కష్టమైనది ఏది ?

కీర్తి.

ఆర్. ఎల్. ఆర్. —తాణంచెర్ల.

మీ అభిమాన రచయిత్రి మీరేనా ?

కాదు. రంగనాయకమ్మ.

ఎస్. కె. బి— పిడుగురాళ్ళ.

దుర్మార్గులను, దుష్టులను ఏరిపట్టి, విసురుగా విధిలోకీలాగి, గట్టిగా గళమెత్తి చెపుదామని వుంది . . .

ఎవరికి ? !

ఎమ్. వి. ఆర్. పోరుమామిళ్ల.

కూటికి లేకుంటే కానీ సహాయం చెయ్యదు. బాగా బ్రతుకుతూంటే చూసి ఓర్వలేదు. మంచి వారిని అపార్థం చేసుకుని వేలెత్తి చూపుతుంది. అటువంటి కుళ్ళు సమాజానికి ఎందుకు భయపడాలి ?

ఎవరు భయపడు తున్నారు ? మీరా ? మీ పక్కవాళ్ళా ?. . .మానవుడు తన బుద్ధులని ఆకృతిలేని సమాజానికాపాదించి—అక్కసు వెళ్ళకక్కుతాడు. అంతే . . .

శివ. —యనమలకుదురు.

మొన్నీ మధ్య ఆడవారిపై తనకున్న అక్కసునంతా వెలిబుచ్చుకున్నాడొకాయన అలాగే కొందరాడువారు కూడా మగవారిని ద్వేషిస్తూ రాస్తారు. ఈ విబేధాలు పోవాలంటే ఏం చేయాలి ?

ఏం చేయాలని అడగడం — అందులోనూ 'శివ' నామం దాల్చిన నువ్వు ! —బాగా లేదు. శివుడు తన భార్యని అర్ధశరీరంగా గౌరవించాడు. ముందది అందరూ గుర్తిస్తే —అసలీ గొడవలే వుండవు ! కోరితన అర్ధ శరీరాన్ని కించ పరచు కోవడం — ఎవరికి వారికే అవమానం కదా !

డి. వై. జి—కుచన్‌పల్లి.

పెళ్ళయిన స్త్రీని గుర్తించకలం. కాని పెళ్ళయిన పురుషుని గుర్తించడం ఎలా ?

అందుకే కదా ! వో పుస్తె పూసో మగాళ్ళు కట్టుకుంటే బాగుంటుందనడం ! . . . .లేక పోతే చాలా ప్రమాదంగా వుంటూందిట. ఒక్క భార్యనే కాదు పిల్లల్ని కూడా దాచి మళ్ళీ హాయిగా కొత్త పెళ్ళికొడుకుల్లా పెళ్ళికి సిద్ధం అవుతున్నారట కొందరు ప్రబుద్ధులు !

ఎ. బి. ఆర్. ఆర్— విజయనగరం.

రోజూ ఒక అమ్మాయి నన్నుచూసి నవ్వుతూంది...

ఎందుకు నవ్వుతుందో ముందు తెలుసుకునితరవాతే ప్రేమించిందేమో అనుకోండి !

వ ల

తన ప్లాను ఎంతవరకూ సక్సెస్ అవుతుందా అని.

ఆ సాయంత్రం క్లబ్‌లో కలిసినప్పుడు పి.హెచ్. డీస్‌ని డీల్ చేసేమూర్తినిఅడిగాడు— నెక్స్ట్ ఇయర్ నా కాండిడేటుకో సీటు దయచేయించగలవా అని. సిగార్ వెలిగిస్తూ మూర్తి నవ్వాడు.

'ఏమిటి విషయం'

అప్పుడే బయట పెట్టదలుచుకోలేదు శివానందం.

కాని పక్కనే వున్న మరో కుర్ర ప్రొఫెసర్ శివరావుకి కథ అంతా అర్ధమైపోయింది.

'నే చెప్పనా' అన్నాడు

శివానందంకీ శివరావుకి దోస్తీ ఎక్కువ. శివానందం మాస్టర్ ప్లాన్సన్నీ శివరావుకి తెలుసు.

చెప్తాను వినండి.

"డబ్బు సంపాదించడానికి మనకెన్ని సోర్స్ లేడ్చాయంటారు. మాగ్జిమమ్ రెండు. మూడు. అంతేనా అంతకంటే ఎక్కువా ? కాబట్టి కొడుకుల్ని విదేశాలు పంపాలన్నా, కూతుళ్లకి రిచ్ సంబంధాలు చేయాలన్నా మనకున్న అవకాశాలు బహుతక్కువ. అందుచేత వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోవడం తెలివితక్కువే అవుతుంది. నిన్నగాక మొన్న ప్రొఫెసర్ శివానందం వలలో ఓ మంచి చేప చిక్కుకుంది. ఆ చేపను మార్కెట్ చేస్తే హాట్‌కేకులా ఈరోజు అమ్ముడు పోతుంది. కాని శివానందం ఈ ఛాన్స్‌ని బయట వాడికి ఇవ్వదలుచుకోవడంలేదు. అదీ అసలు విషయం."

మూర్తికింకా ఈ లౌకికం అర్ధం కాలేదని శివరావు విడమరిచి చెప్పాడు.

"హిస్టరీలో ఫస్ట్‌క్లాస్ కోసం రెండు రోజుల క్రితం శివానందం దగ్గిరికో కుర్రాడొచ్చాడు. కులము గోత్రము అన్నీ కలిసాయిట. కుర్రవాడు కూడ నా జాగ్గానే వున్నాడు. అతగాడికి ఆయన క్లాసిస్తాడు. మీరు అతనికి రీసెర్చ్ చేయడానికి అవకాశం ఇవ్వండి. సంబంధాన్ని మనవాడు క్షణంలో సెటిల్ చేస్తాడు. శ్రావణంలోనో, ఫాల్గుణంలోనో ఋమ్మని కూతురికి పెళ్లి చేస్తాడు. పార్టీకొద్దురుగాని. ప్రజంటేషను కూడ సిద్ధం చేసుకోండి."